సాక్షి ఒడిశా

శనివారం, 13, సెప్టెంబర్, 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు:	రూ. 4,07,446
బంగారం:	2 గ్రాముల 950 మిల్లీ గ్రాములు
వెండి:	17 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

జగన్నాథ ఆలయం పోలీసులకు బాడీ కెమెరాలు



భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని ఆలయం పోలీసులకు బాడీ కెమెరాలు అమర్చనున్నారు. శ్రీ మందిరం చుట్టూ 4 ద్వారాల వద్ద మోహరించిన పోలీసులకు బాడీ కెమెరాలు అమర్చుతారు. అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించకుండా గట్టి నిఘా వేసేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని భావిస్తున్నారు. నిషేధిత వస్తువులు, పరికరాలు, అనధికార సేవలను గుర్తించడంలో ఇది సహాయపడుతుంది. కెమెరాల్లో ఆడియో, వీడియో రికార్డింగ్ సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు.

బాక్సైట్ తవ్వకాలపై..
నిరసన గళం

- తవ్వకాలు ఆపాలని ప్రజల డిమాండ్
- లక్ష్మీపూర్‌లో భారీ ర్యాలీ



బాక్సైట్ తవ్వకాలను అనుమతించేది లేదని ఆందోళన చేస్తున్న జనం

రాయగడ: కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్‌లో వేదాంత కంపెనీ ద్వారా జరుగుతున్న కొడింగమాలి బాక్సైట్ తవ్వకాలను నిలిపివేయాలని ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం నాడు వేదాంత కంపెనీకి వ్యతిరేకంగా లక్ష్మీపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయగడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ పండ నేతృత్వంతో జరిగిన ఈ ర్యాలీలో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర సామంత, రాయగడ శాసనసభ మాజీ ఎమ్మెల్యే మకరంద ముదులి, కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు జిన్ను హికక, కొడింగమాలి సురక్షా సమితి సభ్యులు, బాధిత గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదాంత కంపెనీ కొనసాగిస్తున్న బాక్సైట్ తవ్వకాలను నిలిపివేయాలని ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీపూర్‌లో గల ఒడిశా మైనింగ్ కార్యాలయం(ఒఎంసి) ఎదుట నిరసన తెలియజేశారు.

కర్మాగారం ఏర్పాటైతేనే..

వేదాంత కంపెనీ గత కొద్ది ఏళ్లుగా కొడింగిమాలిలో గల బాక్సైట్ నిక్షేపాలను తవ్వుకుని వెళ్లిపోతోందని, అయితే కర్మాగారం ఏర్పాటైన తర్వాత తవ్వకాలను కొనసాగిస్తే బాగుండేదని కానీ ఎలాంటి కర్మాగారాన్ని ఏర్పాటు చేయకుండా బాక్సైట్ నిక్షేపాలను తవ్వుకుంటూ పోతే పర్యావరణం కలుషితం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు దూరమవుతాయని రాయగడ మాజీ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. ఇప్పటికే 3 మిలియన్ల మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తవ్వేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నారని, మరో 6 మిలియన్ల టన్నుల బాక్సైట్‌ను తవ్వుకునేందుకు ప్రభుత్వంతో ఒప్పందానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. కర్మాగారం ఏర్పాటైతేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, కానీ కర్మాగారం ఏర్పాటు కాకుండా ఇలా బాక్సైట్ నిక్షేపాలను తవ్వుకుపోవడం సరికాదని అన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం కొడింగిమాలి బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి సరైన చర్యలు తీసుకుని ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలే తప్ప వేదాంత కంపెనీతో లాలూచీ పడి ఒప్పందం కుదుర్చుకుంటే తామంతా కలసి తవ్వకాలను అడ్డుకుంటామని



ఓఎంసీ కార్యాలయం (లక్ష్మీపూర్) వద్ద పోలీస్ బందోబస్తు



బాక్సైట్ నిక్షేపాలు గల కొడింగమాలి కొండ



ర్యాలీలో ప్రసంగిస్తున్న మకరందముదులి, దుర్గాపండ తదితరులు

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండ అన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల కోసం ప్రభుత్వం కృషి చేయాలే తప్ప జిల్లాలో ఉన్న ఖనిజ సంపదను ధారాదత్తం చేస్తే సహించబోమని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ, హరిజన ప్రజలతో గల కొరాపుట్, రాయగడ జిల్లాల్లో పరిశ్రమ ఏర్పాటుతోనే సమగ్రాభివృద్ధి జరుగుతుందని కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు, కొరాపుట్ లోక్‌సభ మాజీ సభ్యులు జిన్ను హికక అన్నారు. పరిశ్రమల ఏర్పాటును తామెప్పుడూ వ్యతిరేకించలేదని, ఖనిజ సంపదలను ఇలా దుర్వినియోగం చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మిగిలేది మట్టి మాత్రమేనని అన్నారు.

కొడింగిమాలిలో సుమారు 428 హెక్టార్ల విస్తీర్ణంలో బాక్సైట్ తవ్వకాలకు ప్రభుత్వం యోచిస్తోందని, అందులో భాగంగా రాయగడ జిల్లా పరిధిలో గల కాశీపూర్ ప్రాంతంలో 21 శాతం మిగతా కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు వేదాంత కంపెనీకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చేందుకు సన్నద్ధమవుతోందని ఓఎంసీ డిప్యూటీ జనరల్ మేనేజరు హేమంత కుమార్ బెహరా తెలియజేశారు.



ఓఎంసీ డిప్యూటీ మేనేజర్ బెహరాకు వినతిపత్రం సమర్పిస్తున్న జిన్ను హికక, పవిత్ర సామంత

న్యూస్‌రీల్

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధులకు నిత్యావసరాల వస్తువులను పంపిణీ చేశారు. బియ్యం, కంది పప్పు, ఉప్పు, నూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. ప్రతీ నెల నిరుపేదలకు తమ సంస్థ ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకురాలు ఎం.నళిని తెలిపారు. అదే విధంగా అనాథ ఆదివాసీ విద్యార్థులకు ట్రస్టు ద్వారా ఉచితంగా చదివించడంతో పాటు ఆశ్రమంలో భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

పిడుగు పడి వ్యక్తి మృతి



ఉంగ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి చాలాన్‌గూడ పంచాయతీ తాళపోదర్ గ్రామంలో శుక్రవారం పిడుగు పడి గ్రామానికి చెందిన ఉంగ కార్తమి(46) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తాళపోదర్ గ్రామానికి చెందిన ఉంగ కార్తమి తన భార్య, కుమారుడితో కలిసి శుక్రవారం ఉదయం తమ పొలంలో కలుపు మొక్కలు తీయడం కోసం వెళ్లారు. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో గాలివాన వచ్చింది. ఆ సమయంలో పిడుగు పడడంతో ఉంగ కార్తమి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలియడంతో మల్కన్‌గిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీకా వేయడంతో చిన్నారి మృతి..?



కలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద బిడ్డను పట్టుకొని రోధిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి తుమ్మిమాడకా గ్రామంలో శుక్రవారం టీకా వేసిన కొన్ని గంటల్లో 4 నెలల చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. దేవ మడ్కమి నాలుగు నెలల కుమార్తెకు గత రెండు రోజులుగా జ్వరం ఉంది. అయితే ఈ విషయం ఆరోగ్య సిబ్బందికి చెప్పినా సరే ఏమీ కాదని అంటూ చిన్నారికి టీకా వేశారు. అయితే టీకా వలనే తన బిడ్డ మృతి చెందిందని తండ్రి ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దినబంధు మహానంద ఖండించారు. టీకా వలన ఎటువంటి ప్రమాదం జరగలేదని స్పష్టం చేశారు. జ్వరం ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ముందునుంచి జాగ్రత్తలు తీసుకోకపోవడం వలనే ఈ ప్రమాదం జరిగిందన్నారు.

పోక్సో కేసులో ఆర్‌ఐకు 20 ఏళ్ల జైలు

పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరిలో 2020 జనవరి 25న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శత్రుశల్యకు శుక్రవారం 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసును 2020లో అప్పటి ఆర్.ఉదయగిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ మమతా నాయక్ పోక్సో చట్టం కింద రిజిస్టర్ చేశారు. ఈ కేసును పర్లాకిమిడి ఏడీజే కోర్టులో స్పెషల్ పీపీ ఆర్.జనార్దనరావు ప్రాసిక్యూట్ చేశారు. అలాగే శిక్షపడిన ఆర్‌ఐ జిల్లా న్యాయసేవా ప్రాధికరణకు నష్టపరిహారం కింద రూ.4 లక్షలు చెల్లించాలని కూడా జడ్జి తీర్పు నిచ్చారు.

పిడుగుపాటుతో ముగ్గురు మృతి



సంఘటన స్థలంలో మృతదేహాలు

రాయగడ: పిడుగు పాటుతో ముగ్గురు మృతి చెందగా మరొకరు గాయాలకు గురైన సంఘటన శుక్రవారం సాయంత్రం బిష్ణుగుడ గ్రామంలో చోటు చేసుకుంది. ముగ్గురు పనిచేసుకుంటూ ఉండగా పిడుగు పడంది. బిష్ణుగుడ గ్రామానికి చెందిన సంబారి పిడిక (32) మృతి చెందిన వారిలో ఉండగా మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. మరొకరు గాయాలతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

దండు మారెమ్మ గుడిలో దసరా ఉత్సవాలు



పర్లాకిమిడిలో దండుమారెమ్మ అమ్మవారి గుడి



దోలాట్యాంకు రోడ్డులో దండుమారెమ్మ అమ్మవారు

పర్లాకిమిడి: పట్టణంలో డోలా ట్యాంకు రోడ్డు దండుమాలవీధిలో ఉన్న దండు మారెమ్మ అమ్మవారి తలుపులు శుక్రవారం తెరుచుకున్నాయి. ఏడాదికి ఒకసారి మాత్రమే అదీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పదిహేనురోజుల ముందు తెరుచుకునే ఈ ఆలయంలో అమ్మవారి విగ్రహం వెనుక పెద్ద పాముపుట్ట ఉంటుంది. దసరా శరన్నవరాత్రులు ముగిసిన పిమ్మట విజయదశమి నిశిరాత్రి అమ్మవారికి కొబ్బరి కాయ, పండ్లు నైవేద్యం పెట్టి అఖండ దీపం వెలిగించి తలుపులు మూసి వేస్తారు. తిరిగి తర్వాతి సంవత్సరం విజయదశమి ముందు గుడి తలుపులు తెరుస్తారు. అమ్మవారి వద్ద ఉన్న దీపం వెలుగుతూనే వుండటం విశేషం. అలాగే అమ్మవారి దగ్గర ఉంచి కొబ్బరి కాయ హోమంలో కాల్చి ఆ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెడతారు. శరన్నవరాత్రుల కోసం దండు మారెమ్మ మందిరానికి రంగులు వేసి చుట్టు పక్కలా అమ్మవారు, విఘ్నేశ్వరుడి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో



దసారా పండగకు సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్న దండుమారెమ్మ గుడి

అన్న ప్రసాదాలకు ప్రత్యేక షెడ్డును నిర్మించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయి, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి దండు మారెమ్మ ఉత్సవాలు చూడటానికి వస్తుంటారు. అనేక మంది భక్తులు ఇటీవల ఈ మందిరానికి ఇతోధికంగా విరాళాలు ఇవ్వడంతో దండుమారెమ్మ ముఖద్వారం నిర్మించారు. ఈ ఏడాది ఎప్పటిలాగే దండుమారెమ్మ ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

బస్సు ఓనర్ల సంఘ వార్షిక సమావేశం



సమావేశంలో సంఘ ప్రతినిధులు



హాజరైన సభ్యులు

పర్లాకిమిడి: గజపతి ప్రైవేటు బస్సు ఓనర్ల సంఘం వార్షిక సాధారణ సమావేశం స్థానిక పీడబ్ల్యూడీ.బంగ్లాలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి సంఘం కార్యదర్శి ఇంజా వెంకటరమణ అధ్యక్షత వహించగా అధ్యక్షులు ఛిత్రి సింహాద్రి గత సమావేశం వివరాలు వెల్లడించారు. ముఖ్యంగా బస్సు ఓనర్లు ఆర్‌టీవో అధికారుల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు ఓనర్లు కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు వివరించారు. అలాగే ప్రస్తుత సంఘం కార్యవర్గం వచ్చే ఏడాది జనవరి 31 వరకూ కొనసాగించేలా సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు డి.గజపతిరాజు, కిల్లారి యుగంధర్, కోశాధికారి గణేష్ సాహుకార్, పి.రాంబాబు, శ్రీను సాహుకార్, కిల్లారి గోపి, ఇంజా రవి పాల్గొన్నారు.

బీజేడీ నుంచి మాజీ ఎమ్మెల్యే సస్పెన్షన్



ప్రఫుల్ల కుమార్ మల్లిక్

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా కామాఖ్యనగర్ మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల కుమార్ మల్లిక్‌ను బిజూ జనతా దళ్ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ. ఢెంకనాల్ జిల్లా కామాఖ్యనగర్ మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల కుమార్ మల్లిక్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు బిజూ జనతా దళ్ నుంచి తక్షణమే సస్పెండ్ చేశామని బిజూ జనతా దళ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యాలయ ఉపాధ్యక్షుడు ప్రతాప్ జెనా శుక్ర వారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ జెనా మాట్లాడుతూ ప్రఫుల్ల కుమార్ మల్లిక్‌ను ఈ శతాబ్దంలో అత్యంత అవకాశవాద నాయకుడు అని తీవ్రంగా విమర్శించారు. ప్రఫుల్ల కుమార్ మల్లిక్ బిజూ జనతా దళ్ టికెట్‌పై 4 సార్లు ఎన్నికయ్యారు. బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ స్వయంగా ఆయన తరఫున ప్రచారం చేశారని జెనా అన్నారు. ఆయనకు మంత్రి పదవి కూడా దక్కిందని, పనులు, గనులు వంటి కీలక శాఖలు అప్పగించారని అన్నారు. పార్టీ ఓడిపోయిన తర్వాత, తన రాజకీయ జీవితాన్ని పోషించిన పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించాడని, ఇది అతని అవకాశవాదాన్ని స్పష్టంగా బయటపెడుతుందని ప్రతాప్ జెనా వ్యాఖ్యానించారు.

ఎరువుల సంక్షోభంపై 17న బీజేడీ ధర్నా



శంఖ భవన్‌లో బీజేడీ విలేకర్ల సమావేశంలో మాట్లాడిన ఉపాధ్యక్షుడు, చీఫ్ విప్ సంజయ్ దాస్ బర్మా, ప్రమీలా మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎరువుల కొరతపై తక్షణ చర్యలు చేపట్టాలనే డిమాండ్‌తో విపక్ష బిజూ జనతా దళ్ ఈ నెల 17న రాజ్ భవన్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనుంది. స్థానిక శంఖ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బీజేడీ ఉపాధ్యక్షుడు సంజయ్ దాస్ బర్మా చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ మాట్లాడారు. ఎరువుల నిల్వలు తగినంతగా ఉన్నాయని ప్రభుత్వం పదే పదే చేస్తున్న వాదనను తోసిపుచ్చారు. సరఫరాల శాఖ నుంచి అధికారికంగా అందిన సమాచారం ప్రకారం తమ వాదనను తెరపైకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఎరువుల కొరత ఉందన్నారు. అవసరాలు, సరఫరా మధ్య భారీ అంతరాలు అధికారిక సమాచారంలో వెల్లడైనట్లు వివరించారు.

గంజాం జిల్లాలో 19,561 మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం రైతులు ఆరాటపడుతుండగా మొక్కుబడిగా 10,640 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశారు. భద్రక్ జిల్లాలో రైతాంగం ఎరువుల కొరతతో అల్లాడుతున్నారు. సాగు పనుల కోసం 6,188 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా కోసం అభ్యర్థించగా 863 మెట్రిక్ టన్నులు సరఫరా చేసి అసంతృప్తికి గురి చేసినట్లు బీజేడీ ఆరోపించింది. బాలాసోర్ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగుతుంది. 2,600 మెట్రిక్ టన్నుల ఎరువులు ఆశిస్తున్న రైతులకు నామ మాత్రంగా 900 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. అంగుల్ జిల్లా రైతాంగం రైతాంగం 8,100 మెట్రిక్ టన్నులు కోరగా 4,954 మెట్రిక్ టన్నులు అందజేశారు. ఈ తరహా కొరతను నిరసిస్తూ రైతులు రాష్ట్రవ్యాప్తంగా రహదారులను దిగ్బంధిస్తున్నారని బిజూ జనతా దళ్ నాయకులు వెల్లడించారు. అయితే ప్రభుత్వం 'సంక్షోభం లేదు' అని చాటుకోవడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించింది. 36 నెలల్లోపు తాల్చేర్ ఎరువుల కర్మాగారం పనిచేయిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఏడేళ్ల తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకుండా కాలక్షేప ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ఇదే తరహాలో కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా మండలం స్థాయి ఆందోళనలు చేపడతామని విపక్ష బిజూ జనతా దళ్ హెచ్చరించింది.

కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఉద్యోగులు



పోలీసు స్టేషన్‌లో లిఖిత ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగులు



పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించిన కాంట్రాక్ట్ మహిళ ఉద్యోగులు

జయపురం: కొరాపుట్ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఎల్‌అండ్‌కే ప్రైవేటు కంపెనీ సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదంటూ శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు శ్రామికుల వేతనాలు చెల్లిస్తున్నా కంపెనీ సక్రమంగా చెల్లించటం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో లిఖిత ఫిర్యాదులు చేశారు. ఈ విషయంలో కలుగజేసుకోవాలని కోరారు. చాలా నెలల నుంచి కంపెనీ తమకు జీతాలు చెల్లించటం లేదని వారు ఆరోపించారు. జీతాలు సకాలంలో సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ కుటుంబాల పోషణ కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ జమ చేయడం లేదన్నారు. కార్మిక చట్టాల ప్రకారం తమకు సంక్షేమాలు అందజేయాలని కోరారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకుంటామని సదర్ పోలీసు స్టేషన్ అధికారి సచిదానంద ప్రధాన్ వెల్లడించారు.

ఎనిమిదేళ్ల తర్వాత ఇంటికి..



ఇంటికి చేరిన అగాదు శాంతతో కుటుంబ సభ్యులు



రాజస్థాన్ నుంచి ఇంటికి చేరిన 80 ఏళ్ల వృద్ధుడు అగాదు శాంత

జయపురం: ఆ వృద్ధుడి వయసు 80 ఏళ్లు. 72 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు కూలి పనుల కోసం వలస వెళ్లాడు. కానీ తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడా ఆచూకీ కూడా లేకపోవడంతో ఆయన చనిపోయాడనే కుటుంబ సభ్యులంతా భావించారు. కానీ ఎనిమిదేళ్ల తర్వాత అతడు గురువారం తిరిగి ఇంటికి చేరుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులంతా ఆనందం వ్యక్తం చేశారు. రాజస్థాన్‌కు చెందిన రెండు స్వచ్ఛంద సంస్థల సాయంతో ఆ వృద్ధుడు క్షేమంగా ఇంటికి చేరాడు. జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కెరమిటి గ్రామ పంచాయితీ కెంధుగుడ గ్రామం అగాదు శాంత(80) ఎనిమిదేళ్ల కిందట ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంతగానో గాలించారు. తమ ప్రాంతం నుంచి వలస వెళ్లిన వారందరినీ ఆరా తీశారు. కానీ అగాదు జాడ తెలియరాలేదు. అయితే ఆగస్టు 12వ తేదీన రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు స్వచ్ఛంద సేవకుల నుంచి అశ్వినీ కుమార్ సింగ్, ఆటోడ్రైవర్ బాసు భాయ్‌లకు ఫోను వచ్చింది. ఒక నిస్సహాయ వృద్ధుడు అగాదు శాంత రాజస్థాన్ రాష్ట్ర జయపూర్ జిల్లా చిత్రకూట్ పోలీసు స్టేషన్ పరిధి పురాణిచుంగ్‌లో ఉన్నాడని చెప్పారు. వారు అక్కడకు చేరుకుని అగాదుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జయపురం సబ్‌డివిజన్ కుంద్ర పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఆగస్టు 20న రాజస్థాన్‌లో పురాణచుంగికి వెళ్లారు. అయితే వీరు వెళ్లేటప్పటికి అగాదు వేరే చోటకు వెళ్లిపోయారు. అక్కడ కుండపోత వర్షాలు కురుస్తుండడంతో నిరాశ చెంది వచ్చేశారు. ఈ విషయం కుంద్ర గ్రామంలో బీజేపీ నేత సుమిత్ సాహుకు తెలుపగా అతడు ఈ నెల 6వ తేదీన అగాదు కుటుంబ సభ్యులను పట్టుకుని రాజస్థాన్‌లోని పురాణచుంగి గ్రామానికి వెళ్లారు. అక్కడ స్వచ్ఛంద కార్యకర్తలు అశ్వినీ కుమార్ సింగ్, డ్రైవర్ బాసు భాయిలను కలిశారు. అగాది శాంత ఆచూకీ కనుగొని గురువారం గ్రామానికి తీసుకువచ్చారు. అగాదు శాంతను తమ ఇంటికి చేర్చేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలిసిన కొట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి బద్రి నారాయణ ఆచార్య, బీజేపీ నేత ప్రకాశ్ పట్నాయిక్, తుషార్ భట్, బేణుధర పాత్రో, టిలోచన గౌడ్ లు కెందుగుడ వెళ్లి అగాది శాంతను పరామర్శించారు.

క్లుప్తంగా

జట్నీ - పిప్పిలి మార్గంలో మహిళ దుర్మరణం

భువనేశ్వర్: పూరీ జిల్లా జట్నీ-పిప్పిలి మార్గం డెలాంగ్ చౌరస్తా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం పాలైంది. దంపతులు ప్రయాణిస్తున్న బైక్‌ను ట్రక్కు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భర్త పరిస్థితి విషమంగా కొనసాగుతుంది. మృత మహిళ డెలాంగ్ ప్రాంతం రత్తొపాడా గ్రామానికి చెందిన మమతా పరిడాగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఆమె భర్త దిలీప్ పరిడా విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నారు.

భూఆక్రమణ అడ్డగింత



స్థలం గేటుకు తాళం వేస్తున్న చిగురువలస గ్రామస్తులు

సరుబుజ్జిలి: చిగురువలస పంచాయతీ శ్రీరాంవలస రెవెన్యూ గ్రామంలో 9-1, 9-3 సర్వే నంబర్లలో ఎకరా 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ గ్రామకంతం భూమిని కొందరు స్థానికులు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వ్యక్తికి అనధికార విక్రయం చేసినట్లు సమాచారం. దీంతో కొనుగోలుదారుడు సదరు భూమిని చదును చేస్తుండగా చిగురువలస గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థలం ప్రధాన గేటుకు తాళం వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు వెంటనే పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహశీల్దార్ మధుసూదన్ వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం



మాట్లాడుతున్న సుధాకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి సుధాకరరావు అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశ మందిరంలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా వలంటీర్లు బోధన చేయాలన్నారు. వయోజన విద్యా జిల్లా ఉప సంచాలకుడు ఎ.సోమేశ్వరరావు మాట్లాడుతూ 11207 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి లక్షా 12 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్లు కె.వెంకటరమణ, పి.వెంకటరమణ, డీఎల్‌డీఓ చంద్రకుమారి, వయోజన విద్యా ఏపీఓ బాలచంద్ర, పర్యవేక్షకులు ఎల్.రవణమ్మ పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన చెందవద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు రెండవ సారి ఎరువులు ఇంకా అందలేదని, ఎరువులు ఎప్పుడు వస్తాయని పలువురు రైతులు కలెక్టర్‌ను అడిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంత వరకు యూరియా తీసుకోని రైతులకు సంబంధిత మండల వ్యవసాయ అధికారులు వెంటనే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి హిందీ పక్షోత్సవాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 14న జాతీయ హిందీ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో 15 రోజులపాటు హిందీ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు హిందీ వికాస వేదిక అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఖడంగా శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కవుల వేషధారణలు, కవితాగానం, దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం, ఉపాధ్యాయులకు ఉత్తరాలు, స్నేహితులకు లేఖలు, అందమైన చేతిరాత(సులేఖన్) పోటీలు, ఏకపాత్రాభినయం, నాటికలు, జాతీయ సమైఖ్యతాదాపకాల ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని రామకృష్ణారావు, నిరంజన్ పేర్కొన్నారు. వివరాలకు 94416 49118 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

16న పీడీఎస్ బియ్యం వేలం

కొత్తూరు: మండలంలో శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ డీటీల తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన 390.50 కింటాళ్ల బియ్యాన్ని ఈ నెల 16న తహశీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహశీల్దార్ కె.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. సీజ్ చేసిన బియ్యం సరుబుజ్జిలి మండలం ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో ఉందని, కిలో ధర 42.5గా నిర్ణయించామని చెప్పారు. ఎటువంటి డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన



బీజేపీ చీఫ్‌తో ముఖ్యమంత్రి చర్చ

భువనేశ్వర్: భారత ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఢిల్లీ బయల్దేరారు. ఈ సందర్భంగా 3 రోజుల పాటు ఢిల్లీలో పలు ప్రభుత్వ, సంస్థాగత కార్యక్రమాలకు హాజరు కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా కొంతమంది కేంద్ర మంత్రులను కలవనున్నారు.

ఉప రాష్ట్రపతికి శుభాకాంక్షలు

భారత దేశ 15వ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన సీపీ రాధాకృష్ణన్‌కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పవిత్ర పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేసేందుకు అంకిత భావంతో పూర్తి పదవీకాలం సద్వినియోగం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

జేపీ నడ్డాతో చర్చ

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ భారతీయ జనతా పార్టీ చీఫ్ – కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డాను కలిశారు. రాష్ట్రంలో మంత్రి మండలి విస్తరణ ఉత్కంఠ నెలకొని ఉన్న సమయంలో జాతీయ శాఖ అధ్యక్షునితో భేటీ చర్చనీయాంశమైంది. త్వరలో రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ఈ భేటీ బలమైన సంకేతంగా పరిగణిస్తున్నారు. అలాగే వివిధ రాష్ట్ర నిర్వహణ కార్పొరేషన్లకు అధిపతుల జాబితాను ఖరారు చేయనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ కీలక నిర్ణయాలను రూపొందించడంలో పార్టీ జాతీయ నాయకత్వంతో చర్చలు కీలకమైనవిగా భావిస్తున్నారు. చర్చల సందర్భంగా, ముఖ్యమంత్రి ఒడిశా ప్రభుత్వం యొక్క ప్రజా కేంద్రీకత చొరవలు, ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలో మౌలిక ఆరోగ్య సదుపాయాల అభివద్ధి మరియు రాష్ట్ర ఆరోగ్య రంగం భావి రూపకల్పనపై వివరణాత్మక చర్చలు జరిపినట్లు సన్నిహిత వర్గాల సమాచారం. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ ఆలయంపై డ్రోన్ చక్కర్లు



పతిత పావన పతాకం పరిసరాల్లో డ్రోన్ కెమెరా చక్కర్లు

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుడు కొలువై ఉన్న పూరీ శ్రీ మందిరం శిఖరంపై డ్రోన్ చక్కర్లు కొట్టడం తీవ్ర కలకలం రేపింది. వరుసగా గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం శ్రీమందిరం శిఖరంపై నిత్యం రెపరెపలాడే పతిత పావన పతాకంపై ఒక డ్రోన్ ఎగురుతున్న దశ్యం సందర్శకుల దృష్టికి వచ్చింది. శ్రీ మందిరం శిఖరం ఈ స్థలాన్ని 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించినప్పటికీ తరచూ అక్కడ డ్రోన్ చక్కర్లు కొట్టడం అనేది పెద్ద ప్రశ్న. ప్రసిద్ధ ఆలయంపై తరచుగా డ్రోన్లు ఎగురవేయడం వల్ల ఆలయ భద్రతపై తీవ్ర ఆందోళనలు తలెత్తుతున్నాయి.

మహానదిలో చిక్కుకున్న ఏనుగుల గుంపు



నది నడిబొడ్డున చిక్కుకున్న ఏనుగుల గుంపు

భువనేశ్వర్: కటక్ జిల్లా మహానదిలో 17 ఏనుగుల గుంపు చిక్కుకుంది. ఏనుగుల గుంపు కదలికలపై అటవీ శాఖ అధికారులు నిఘా ఉంచారు. బంకి ప్రాంతంలోని భాగీపూర్ ఘాట్‌లో గుంపు చిక్కుకుంది. గురువారం రాత్రి ఏనుగులు మహానది దాటుతుండగా నదీ తీరానికి దూరంగా చిక్కుకున్నాయి. ఏనుగుల గుంపు అఠాగొడా సుకాశన్ అడవి నుంచి చందక డొంపాడ అభయారణ్యానికి వెళ్లడానికి మహానదిని దాటుతున్నాయి. అయితే మహానదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల అవి చిక్కుకున్నాయి. డొంపాడ చందక అటవీ శాఖ ఏనుగుల కదలికలపై నిఘా ఉంచింది.

పాఠశాల తరలింపుపై నిరసన

బూర్జ: అల్లెన ప్రాథమికోన్నత పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలని, వేరే పాఠశాలలో విలీనం చేయవద్దని కోరుతూ సర్పంచ్ జడ్డు మహేష్, విద్యార్థుల, తల్లిదండ్రులు, గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఇంత వరకు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయకపోవడం తగదన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం సమగ్ర శిక్ష ఏఎంఓ చిగురుపల్లి సుధాకరరావు, సీఎంఓ బొడ్డేపల్లి శ్రీధర్, ఐఈసీఓ గోవిందరావు వద్ద సమస్య వివరించారు. ఇక్కడి 3, 4, 5వ తరగతులను పాలవలస ప్రైమరీ మోడల్ స్కూల్‌కు, 6, 7, 8వ తరగతులను పాలవలస జెడ్పీ హైస్కూల్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగావళి నది ఒడ్డున ఉన్న పాలవలస వెళ్లాలంటే సుమారు 12 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందని, అంతదూరం చిన్నారులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నిరసన కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు విద్యాకమిటీ చైర్మన్ మురపాక శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యంపై అవగాహన, చికిత్స, వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుటుంబ సంక్షేమం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ఎన్.సి.డి స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లి, పిల్లల రక్షణ కార్డ్, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్, రుతు పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు వివరించారు.

సర్పంచ్‌లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణకు హాజరైన మహిళా సర్పంచ్‌లు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్న పంచాయతీ సాధన కేంద్రంలో కలిమెల, కోరుకొండ, మత్తిలి సమితుల్లోని వివిధ పంచాయతీలకు చెందిన మహిళా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి అధికారి నరేష్ సభర్ బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో కలిమెల సమితి పీఈవో ఎస్.స్వాతి, కోరుకొండ పీఈవో సంజనా మహరణా, భగవతి మండాల్, సునీత సామల్, తపస్విని జెనా పాల్గొన్నారు.



తెలినీలాపురం పక్షుల విడిది కేంద్రంలో చెట్లపై ఉన్న పక్షులు (ఫైల్)

పక్షుల విడిదిలో.. సమస్యల కొలువు

- తెలినీలాపురంలో కనీస సౌకర్యాలు కరువు
- శిథిలావస్థకు వాచ్‌టవర్
- మౌలిక వసతులు లేక పర్యాటకుల అవస్థలు



పెచ్చులూడిపోతున్న టవర్ మెట్ల మార్గం

టెక్కలి రూరల్ :

ప్రముఖ పర్యాటక స్థలం, విదేశీ పక్షుల విడిది తెలినీలాపురంలో సమస్యలు తిష్టవేశాయి. ఏటా శీతాకాలం ఆరంభంలో సైబీరియా దేశం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ అనే వలస పక్షులు టెక్కలి మండలం తెలినీలాపురంలోని విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సంతానోత్పత్తి చేసుకుని తిరిగి తమ పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి. ఈ ఈ పర్యాటక కేంద్రం వద్ద చింతచెట్లపై చేసే విన్యాసాలు, కేరింతలు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ కేంద్రంలో ఇటు పక్షులకు అటు పర్యాటకులకు అనేక సమస్యలు వేధిస్తున్నాయి.



శిథిలావస్థకు చేరుకుంటున్న వాచ్ టవర్

ప్రధాన ఇబ్బందులివే..

ఏటా ఇక్కడి పక్షులను చూసేందుకు వచ్చే వారికి అనేక సమస్యలు స్వాగతిస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అరకొరగా ఉన్న మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా సామగ్ర సైతం పాడైపోయాయి.

పక్షులను చూసేందుకు ఏర్పాటు చేసిన వాచ్ టవర్ నిర్మాణం జరిగి దశాబ్దాలు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో పర్యాటకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కింద పడిన పక్షులకు సైతం సరైన సంరక్షణ ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు.ఇటీవల రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలినీలాపురం పక్షుల విడిది కేంద్రాన్ని సందర్శించి కేంద్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయారని, ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిన్న టాపర్.. నేడు లంచగొండి



లంచం సొమ్ముతో విజిలెన్స్‌కు చిక్కిన తహసీల్దార్ అశ్విని కుమార్ పండా

భువనేశ్వర్: ఒడిశా సివిల్స్ పోటీ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన నిన్నటి యువ అధికారి నేడు లంచగొండిగా రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు చిక్కాడు. సంబల్‌పూర్ జిల్లా బమ్రా తహసీల్దార్ అశ్విని కుమార్ పండా రూ.15,000 లంచం తీసుకుంటుండగా అరెస్టు శుక్రవారం చేశారు. మ్యుటేషన్ కేసులో వ్యవసాయ భూమిని ఇంటి స్థలంగా మార్చడానికి అతడు రూ. 20,000 లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ బృందం వ్యూహాత్మకంగా తన కార్యాలయ డ్రైవర్ పి.ప్రవీణ్ కుమార్ ద్వారా రూ.15,000 లంచం తీసుకుంటుండగా అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైవరు ప్రవీణ్ కుమార్‌ను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం కింద గుంజిన సొమ్ముని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆనాడు 29 ఏళ్ల యువకుడి విజయగాథ లక్షలాది మంది ఆశావహ యువతకు ప్రేరణగా నిలిచింది. నేడు లంచం వ్యవహారం తాజా చర్చలకు దారితీసింది. ధర్మశాల మండలం ఖేత్రపాల్ గ్రామానికి చెందిన అశ్విని కుమార్ పండా ఒడిశా సివిల్ సర్వీసెస్‌లో ఎలాంటి శిక్షణ లేకుండానే 2019 ఒడిశా సివిల్స్ పరీక్షల్లో తన మొదటి ప్రయత్నంలోనే తహసీల్దార్‌గా ఎంపికై అగ్రస్థానంలో ఉత్తీర్ణత సాధించాడు.

జాతీయస్థాయి షూటింగ్‌లో గోల్డుమెడల్

- సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ అసమాన ప్రతిభ



మౌసమీ సిమాలాయి

పర్లాకిమిడి: అఖిల భారత థాల్ సైనిక్ క్యాంపు 2025 పోటీలలో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న మౌసమీ సిమలాయి (14)కు జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్‌లో గోల్డు మెడల్ సాధించి గజపతి జిల్లాకు ఖ్యాతి తెచ్చింది. మౌసమీ సిమలాయి గజపతి ష్టేడియం వద్ద చేపలు అమ్ముకునే మోనికా, బలాబి చంద్ కూతురు. స్థానిక 14 వార్డు సంజయ్ గాంధీ కాలనీలో వుంటున్న ఆమె తల్లిదండ్రులు ఆర్థికంగా వెనుకబడినా కూతురు మౌసమీని సెంచూరియన్ పబ్లిక్ స్కూల్‌లో చేర్పించారు. ఎన్.సి.సి.క్యాడెట్ల రైఫిల్ షూటింగ్ న్యూ ఢిల్లీ థాల్ సైనిక్ క్యాంపు సెప్టెంబరు 2 నుండి 11 వరకూ జరిగాయి. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 17 ఎన్.సి.సి.డైరక్టరేస్‌లలో, 1546 మంది క్యాడెట్లు న్యూఢిల్లీ థాల్ సైనిక్ క్యాంపులో పాల్గొన్నారు. వారిలో 1200 మంది గరల్స్ జూనియర్ వింగ్ రైఫిల్ షూటింగులో మౌసమీ సిమలాయి సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ద్వారా పోటీలలో పాల్గోని అసమాన ప్రతిభ చూపి గోల్డు మెడల్ సాధించింది. ఆమె విజయం పట్ల సెంచూరియన్ వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎన్.రావు, ప్రిన్సిపల్ సునీతా పాణిగ్రాహి, వర్శిటీ రిజిస్ట్రారు డా.అనితాపాత్ర్, డైరక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, ప్రాంతీయ సంచాలకులు సంబిత్ పాత్రోలు అభినందనలు తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి నిందితులకు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎస్‌డీజేఎం వర్షా దాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ ఏడాది జూన్ నెల 26వ తేదీన స్థానిక మెయిన్ రోడ్డు వద్ద గల బాలాజీ మెడికల్ స్టోరులో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి బాధితుడు చిన్నారి సునీల్ కుమార్ సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేసి హేమంత కుమార్ రావ్, శేఖ్ బాషా, వి వేంకటేష్ కు అరెస్టు చేసి నిందితుల నుంచి రూ. 25,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణకు రాగా జడ్జి నలుగురు సాక్షులను విచారించిన అనంతరం నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. పది వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానాను చెల్లించలేని పక్షంలో అదనంగా మరో ఆరు నెల నిందితులు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



భర్తతో రంజిత (ఫైల్)

రాయగడ:

జిల్లాలోని గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్ పరిధి డొంబొసర గ్రామంలో ఒక వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలు అదే గ్రామానికి చెందిన రంజిత త్రిపాఠి (32)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుణుపూర్ సబ్ డివిజన్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్ ఐఐసీ కేకేబికే కుహరో తెలియజేసిన వివరాల ప్రకారం.. డొంబొసార గ్రామానికి చెందిన నరసింహ త్రిపాఠితో 2007వ సంవత్సరంలో రంజితకు వివాహం జరిగింది. అయితే పెళ్లి జరిగినప్పటి నుంచి రంజితకు అత్తవారింట్లో వేధింపులు కొనసాగుతుండేవని ఆరోపిస్తున్నారు.

సోదరభావంతో మెలగాలి



ప్రసంగిస్తున్న నరేంద్రనాథ్ పట్నాయక్

జయపురం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రవాదం, మత మౌఢ్యం మొదలగు రుగ్మతలకు సరైన చికిత్స చెప్పగలిగేది సార్వత్రిక సోదరత్వమే నని స్వామీ వివేకానంద 1893 సెప్టెంబర్ 11వ తేదీన చికాగోలో చేసిన ప్రసంగంలో ఉద్బోధించారని ప్రముఖ విద్యావేత్త , ప్రసిద్ధ రచయిత నళిణీ రంజన్ రథ్ అన్నారు. యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డే(సార్వత్రిక సోదర దినోత్సవం) సందర్భంగా గురువారం రాత్రి స్థానిక నెహ్రూనగర్‌లోని అగ్రసేన్ భవనంలో వివేకానంద కేంద్రం, కన్యాకుమారి వారి , జయపురం శాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మానవులు వ్యత్యాసాలను విడిచి సోదరులుగా ఏకమై నడచినప్పుడు సమాజం ప్రగతి పథం పయనిస్తోందన్నారు. సోదరభావమే సమ సమాజ నిర్మాణానికి,శాంతి స్థాపనకు, ప్రగతికి పునాది అన్నారు. కార్యక్రమంలో వివేకానంద కేంద్ర జయపురం శాఖ కోఆర్డినేటర్ ప్రమోద్ కుమార్ రౌళో, కేంద్ర సభ్యురాలు బణిత పండ, ఆల్ ఇండియ రేడియో జయపురం విశ్రాంత అధికారి నరేంద్రనాథ్ పట్నాయక్, స్వామి వివేకానంద కేంద్ర కమిటీ సభ్యురాలు విజయలక్ష్మీ రాయ్, నయన బిశాయి, జున్ను పండ, రేణుకదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రమోద్ కుమార్ రౌళో బహుమతులు అందజేశారు.

మూడు వేల మెట్రిక్ టన్నుల ఎరువులేవీ?

- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాకు మూడు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందజేశామని చెబుతున్నారని, అవి ఎప్పుడు వచ్చాయి.. ఎంత మంది రైతులకు అందజేశారో తెలియజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజేయ్‌కుమార్ వ్యవసాయ సమీక్షలో మాట్లాడుతుండగా టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరి కలగజేసుకొని కేంద్ర మంత్రి జిల్లాకు 3వేల టన్నుల ఎరువులు అందజేశారని, ప్రతిపక్షం కావాలనే ఆరోపణలు చేస్తోందన్నారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులకు కొరత ఉండేది కాదని, కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, ఒడిశాలో వెయ్యికి చొప్పున బస్తా యూరియాను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఈ-క్రాప్ చేయలేదని, పంటలు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు ఎరువులు అందించామని, కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద ఆ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే అందిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో బాహుదానదిపై సుమారు రూ.20 కోట్లతో కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అంచనా విలువలు, ఆమోదం పూర్తయితే కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తులు ఆంధ్రాలో ప్రయోజనం పొందుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదని, పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే సరుకులను అంగంట్లో అమ్మేస్తున్నారని సభ్యులు దక్కత ఏకాంబరి, దున్న గురుమూర్తిలు ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీఓ కె.రామారావు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్


జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బబిత ఆధ్వర్యంలో జాతీయలోక్ అదాలత్ శనివారం జరగనుంది. ఇందుకోసం ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 19 లోక్అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటార్ ప్రమాద బీమా, చెక్‌బౌన్స్, ప్రాంసరీ నోట్, ఎక్సైజ్, భూమి తగాదా, కుటుంబ తగాదాలు, వాటర్, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిస్కారం చేసుకోవచ్చని కక్షిదారులు, ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి



రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడకారులు ఉత్తమ క్రీడా ప్రతిభా పాటవాలతో విజేతలుగా నిలవాలని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఈనెల 13 నుంచి 15 వరకు కాకినాడ జిల్లా మండపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం .రామారావు క్రీడాదుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉద్యోగావకాశాల్లో ముందంజలో ఉంటారన్నారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలు ప్రారంభం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిపాలన సౌలభ్యం కోసం అనకాపల్లి, విజయనగరంలలో నూతనంగా నిర్మించిన వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలను సంస్థ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి, విజయనగరం ప్రాంత ప్రజలకు పరిపాలన పరంగా మరింత చేరువ కావడానికి వీలుగా వీఎంఆర్‌డీఏ నూతనంగా జోనల్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విజయనగరంలో రూ.47.95 లక్షలు, అనకాపల్లిలో రూ.33.5 లక్షలతో ఈ కార్యాలయాలను పునర్నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ విభాగాధిపతులు మురళీకృష్ణ వినయ్ కుమార్, హరిప్రసాద్, సుజాతా శివాని, భవానీశంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని పాడి రైతు మృతి


ఈశ్వరరావు మృతదేహం

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన పాడి రైతు పాత్రు ఈశ్వరరావు(45) రైలు ఢీకొని శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఈశ్వర రావు అలమండ ఎనిమిది కానాల వద్ద రైలు పట్టాల సమీపంలో గేదెలు కాస్తున్న సమయంలో రైలు ఢీకొని మృతిచెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికులు రైల్వే పోలీసులకు సమచారం అందించగా వచ్చి పరిశీలించారు.

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం


రైల్వేట్రాక్‌పై మృతదేహం

జామి: మండలంలోని అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనిపై ,రైల్వేపోలీసులు అందించిన సమచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుంది. చామన చాయ రంగులో ఉండి ఎరుపు రంగు పై తెలుపు రంగు గడులు గల టీషర్టు, నీలం రంగు నైట్ ఫ్యాంట్ ధరించి ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్ 919490617089, 6301365605 నంబర్లను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు. ఈ ఘటనపై రైల్వే హెచ్‌సీ వి.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవస్థల ప్రయాణం..!

ఓ వైపు చాలీచాలని బస్సులు..మరో వైపు పాడైపోయిన రహదారులతో సమయానికి రాని బస్సులు..ఇంకో వైపు స్త్రీ శక్తి పథకానికి కేటాయించిన బస్సుల్లో అధిక రద్దీతో గొడవలు..వెరసి సాధారణ ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించేందుకు సతమవుతున్నారు. బస్సుల సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.

- అరకొరగా బస్సులు
- ఉచిత బస్సుల్లో రద్దీ ఇబ్బందులు
- ఆక్యుపెన్సీ లేదని కొన్ని గ్రామాలకు బస్సుల రద్దు
- జిల్లాలో మూడు డిపోల పరిధిలో 237 ఆర్టీసీ బస్సులు
- వాటిలో 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న సాధారణ ప్రయాణికులు


ప్రయాణీకులతో రద్దీగా ఉన్న పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్

పార్వతీపురంటౌన్: సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళాసంక్షేమ పథకాలను పక్కన పెట్టి స్త్రీశక్తి ఉచిత బస్సు అమలు చేసి మమ అనిపించింది. ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం అమలు చేసింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ నష్టాల బాటలో నడుస్తున్నప్పటికీ, జిల్లాలో సరిపడా బస్సులు లేకపోయినప్పటికీ ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాలకు సర్వీసులు నడిపే పరిస్థితి లేకపోయింది. మన్యం జిల్లాలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణం అంటే మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రయాణం అవస్థల ప్రయాణంగా సాగుతోంది. ఆక్యుపెన్సీ లేని కొన్ని గ్రామాలకు, రోడ్డు బాగాలేని కొన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు రద్దుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మేరకు ట్రిప్‌లు కుదించారు.

జిల్లాపరిధిలోగల సాలూరు, పాలకొండ, పార్వతీపురం డిపోలలో బస్సుల కొరత ఉంది. ఉన్న బస్సుల కండిషన్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించకుండా ఉచిత బస్సు పథకంతో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే..

జిల్లా వ్యాప్తంగా మూడు డిపోల పరిధిలో 237 బస్సులు ఉంటే అందులో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి మొత్తం 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే ఉపయోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో కేవలం 50 బస్సులు మాత్రమే సాధారణ సర్వీసులు నడుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గిరిజన, మారుమూల మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు సరిగ్గా లేక ప్రయాణ అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సుల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ పథకానికి బస్సులు వేయడంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోంది.

గంటల తరబడి వేచి చూడాల్సిందే

జిల్లాలో మూడు డిపోల పరిధి నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దానికి తోడు రహదారులు గుంతలమయం కావడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడడం, డిపోలకు సమయానికి బస్సులు రాకపోవడం, కాజ్‌వేలు, వంతెనలు మరమ్మతులకు గురవడం వంటి సమస్యలతో బస్సులు సమయానికి దొరకక వేచిచూడాల్సిన పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉంది. జిల్లాలో బస్సుల సంఖ్యను పెంచి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అటు ప్రయాణికులు, ఇటు ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు.

సీట్ల కోసం రోజూ గొడవలే..

అసలే అరకొర బస్సులతో బస్సులకు ప్రయాణికుల తాకిడి ఎక్కువ అవుతోంది. దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు సీట్లు సరిగా దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా మేము రుమాలు వేశామని ఒకరు..మేము టవల్ వేశామని మరొకరు ఇలా ఒక్కో సాకుతో ప్రతిరోజూ బస్సుల్లో గొడవలు పడుతున్న సందర్భాలు అనేకం. బస్సుల్లో పురుషులు ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. డిపోల నుంచి బయలు దేరిన కొన్ని బస్సుల్లో పురుషులపై మహిళలు దాడికి పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి.. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే బస్సుల సంఖ్య పెంచి సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టు జారితే అంతే

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పలు కళాశాలలకు వచ్చి వెళ్లేందుకు ఎంతోమంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తారు. ఈ మేరకు ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉన్న అరకొరగా ఉన్న బస్సులు ఖాళీ లేకుండా ప్రయాణికులతో నిండి ఉండడంతో విద్యార్థులు ఇలా ప్రమాదకరంగా బస్సు ద్వారం వద్ద నిలబడి ప్రయాణం చేస్తున్నారు. దీంతో ద్వారం వద్ద కదిలే బస్సులో ప్రమాదకరంగా ప్రయాణం చేయడంతో తోటి ప్రయాణికులు సైతం ఆందోళన చెందుతున్నారు.



బస్సు ద్వారం వద్ద నిల్చుని బయటకు వేలాడుతూ విద్యార్థులు

జిల్లా పరిధిలో అందుబాటులో 237 బస్సులు



జిల్లా వ్యాప్తంగా మూడు డిపోల పరిధిలో 237 బస్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో స్త్రీశక్తి పథకానికి 187 బస్సులను అందుబాటులో ఉంచాం. కొన్ని ప్రాంతాల్లో వంతెనలు, కాజ్‌వేలు, రహదారుల మరమ్మతుల కారణంగా బస్సులు కొన్ని సందర్భాల్లో ఆలస్యంగా వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు బస్సుల సర్వీసులను పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. అందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపించాం.- పి. వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజారవాణాధికారి, పార్వతీపురం మన్యం

గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు

- డీఐజీ గోపీనాథ్ జెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖ సిటీ/పార్వతీపురం రూరల్/విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో డీఐజీ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులు రూ.10,04,89,621 స్వాధీనం చేసుకోవడాన్ని అభినందించారు. ఇప్పటి వరకు 1,119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచినట్లు చెప్పారు. అలాగే 51 మంది నిందితులపై పీడీ చట్టం, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. వీరిలో 24 మందికి 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. విశాఖపట్నం రేంజ్ పోలీసులు స్టే సేఫ్, నిదాన్, కాజ్, నాట్ గ్రిడ్ యాప్స్ ద్వారా పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కృషిని అభినందించారు. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలు, మహిళ మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. ఇటువంటి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. రేంజ్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యలపై చర్చించారు. భవిష్యత్తు కోసం తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కోడూరుమాత యాత్రోత్సవం నేడు


కోడూరు మరియమాత పుణ్యక్షేత్రం

బాడంగి: మండలంలోని కోడూరు మరియ మాత యాత్రోత్సవం శనివారం జరగనుంది. ఈ యాత్రలో సుమారు 20వేలమంది క్రైస్తవ, ఇతర మతస్తులైన యాత్రికులు పాల్గొనున్నారు. ఈ యాత్రకు సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, విజయనగరం డిపోలనుంచి ఆర్టీసీవారు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.ఉదయం నుంచే దివ్య బలిపూజలు నిర్వహించనున్నారు.మూడవపూజకు విశాఖ అగ్రపీఠాధిపతులు హాజరుకానున్నారు.భక్తులు మాతను దర్శించుకునేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటయ్యాయి. బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, రూరల్ సీఐ నారాయణ రావు తోపాటు ఎస్సై సిబ్బంది శుక్రవారం యాత్ర స్థలాన్ని సందర్శించి యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందో బస్తు ఏర్పాట్లు చేయనున్నారు. ఆర్టీసీబస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వన్‌వే ట్రాఫిక్‌ను పాటిస్తూ బాడంగిలోని పిన్నవలస జంక్షన్ వద్ద ప్రవేశించి కోడూరునుంచి రామచంద్రపురం మీదుగా బయటకు వెళ్లనున్నాయి. కాలినడకన పలువురు భక్తులు రానున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ


చోరీ సంఘటనపై స్టేట్‌మెంట్ తీసుకుంటున్న ఎస్సై సుదర్శన్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం సమీపంలో రైవాడ కాలువ గట్టుపై గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళ మెడలో గొలుసును తెంపుకుని పారిపోయాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన నెక్కల లక్ష్మి తన తల్లితో పశువులకు గడ్డి కోసుకుని వస్తుండగా గ్రామసమీపంలోని రైవాడ కాలువగట్టుపై ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకుని వచ్చి వెంకటలక్ష్మి మెడలో గొలుసు తెంపుకుని పారిపోయాడు. దీంతో వెంకటలక్ష్మి వల్లంపూడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను ఆరా తీశారు. గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు పోలీసు బృందాలతో విచారణ చేయిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనాథ బాలికలకు 100 సైకిళ్ల పంపిణీ


బాడంగి హైస్కూల్‌లో సైకిళ్లను పంపిణీ చేస్తున్న వీకే, కెనరాబ్యాంకు డీజీఎం, ప్రతినిధులు

బాడంగి: విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తల్లితండ్రులు లేని అనాథబాలికలకు సుమారు రూ.4లక్షల విలువైన 100సైకిళ్లను పంపిణీ చేశారు. బాడంగి హైస్కూల్‌లో హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన బొబ్బిలి డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన వసుధైక కుటుంబం, కేజీబ్రీసంస్థ, కెనరాబ్యాంకువారి సౌజన్యంతో సైకిల్స్ సమకూర్చగా కనీసం పాఠశాలలకు రెండుకిలోమీటర్ల దూరం, 85శాతం మార్కులు సాధించిన అనాథ బాలికలకు అందజేశారు. అదేవిధంగా హైస్కూల్‌లో చదువుతున్న 50 మంది అనాథబాలికలకు ఒక్కొక్కరికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో వీకేఫౌండేషన్ ప్రతినిధి ప్రతాప్, కెనరాబ్యాంకు డీజీఎం అనంతపద్మనాభం, రీజనల్‌మేనేజర్ వినోద్, సీనియర్ మేనేజర్ రాజ్యలక్ష్మి, ఎంఈఓ. లక్ష్మణదొర, జెడ్పీటీసీ పెద్దింటిరామారావు, ఎంపీటీసీ డి.శ్రీనివాస రావు, సర్పంచ్ కండి రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ భారతి, మూడు జిల్లాలనుంచి హాజరైన బాలికలు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు నిర్వహించారు.

14న జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడకారుల ఎంపిక పోటీలు ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీల్లో 2006 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి, బాలురు 75 కేజీల లోపు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కృష్ణా జిల్లా గొల్లపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష


ముద్దాయి కంకణాల కిరణ్

విజయనగరం క్రైమ్/తెర్లాం: ఈ ఏడాది ఫిబ్రబరి నెలలో నమోదైన పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు కిరణ్ (36)కు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని తెర్లాంకు చెందిన ఓ బాలిక (12) నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కంకణాల కిరణ్ వెనక నుంచి వచ్చి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో, దగ్గరలో ఉన్న కొంత మంది వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. ఆ బాలిక ఇంటికెళ్లి కన్నవారికి చెప్పగా బాలిక తల్లి తెర్లాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.సాగర్ బాబు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు నమోదైన 7 నెలల కాలంలోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా తెర్లాం ఎస్సై బి.సాగర్ బాబు చర్యలు చేపట్టారని ఎస్పీ తెలిపారు. కోర్టులో నేరారోపణలు రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, బాధితురాలికి పరిహారంగా రూ.25,000 ఇవ్వాలని పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్పీ వివరించారు.

115 డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.11.50 లక్షల జరిమానా


ఎస్పీ వకుల్ జిందల్

మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుబడిన 115 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 115 కేసులు నమోదు చేసి విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా వారందరికీ రూ.11.50 లక్షలను జరిమానాగా విధించారని ఎస్పీ తెలిపారు.

ఆరికతోటలో జిల్లా స్థాయి జూడో జట్ల ఎంపికలు


రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన బాలికల జట్టుతో ఎంఈవో తిరుమలప్రసాద్, బి రత్నకిషోర్, సీహెచ్ రాజేష్ తదితరులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిలాస్థాయి అండర్ 14,17,19 బాలికలు, బాలుర జూడో జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపిక జిల్లా జూడో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రత్నకిషోర్, అండర్ 19 జిల్లా ఎస్‌జీఎఫ్ పరిశీలకుడు సీహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.ఈ పోటీలో జిల్లాలోని 25 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొనగా సర్పంచ్ పెంకి పుష్పమ్మ, ఎంఈవో తిరుమల ప్రసాద్ పోటీలను ప్రారంభిచారు. అలాగే అండర్ 14 విభాగంలో బాలికలు ఏడుగురు, బాలురు ఏడుగురు చొప్పున ఎంపిక చేయగా అండర్ 17 విభాగంలో బాలికలు 9 మంది, బాలురు 9 మంది, అండర్ 19 విభాగంలో బాలికలు 9 మంది, బాలురు 9 మంది చొప్పున ఎంపిక చేసి మొత్తం 50 మందిని రాష్ట్రస్థాయి జూడో పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు.ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.కృష్ణవేణి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి నల్ల వెంకటనాయుడు, వైస్ ఎంపీపీ ప్రతినిధి పెంకి శేఖర్, పీడీలు వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

- జిల్లా ప్రజా రవాణా అధికారి
- డయల్ యువర్ డీపీటీఓకు 26 వినతులు


డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని పల్లెలు, గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రజా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమానికి 26 వినతులు ఫోన్ ద్వారా వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులను సంప్రదించి సాధ్యమైనంత వరకూ పల్లెలకు, శివారు గ్రామాలకు బస్సు సౌకర్యం అలాగే స్టాపుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వచ్చిన వినతుల్లో కొన్ని

విశాఖపట్నం-పార్వతీపురం చివరి ట్రిప్ పార్వతీపురం టౌన్‌లోకి వచ్చే విధంగా ఏర్పాటు చేయలని పార్వతీపురం నుంచి వి.శ్రీహరి కోరారు.

- పార్వతీపురం నుంచి దుగ్గేరు బస్సును రెండు ట్రిప్ లు పెంచమని దుగ్గేరు నుంచి జి.జనార్ధన రావు కోరారు.
- పార్వతీపురం నుంచి పెద్ద బుడ్డిడికి బస్సు సౌకర్యం కల్పించాలని పెద్ద బుడ్డిడి నుంచి ఆర్.రాజు విజ్ఞప్తి చేశారు.
- మక్కువ నుంచి విశాఖపట్నం, దుగ్గేరు -బొబ్బిలి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించమని దుగ్గేరు నుంచి బి.రామకృష్ణ, కె. సీతారాంలు కోరారు.
- పాలకొండ నుంచి గుమ్మలక్ష్మీపురం వయా వీరఘట్టం, జియ్యమ్మవలస మీదుగా బస్సు సౌకర్యం, పాలకొండ - కురుపాం గ్రామాలకు మరో బస్సు సర్వీసు పెంచాలని, అలాగే పార్వతీపురం -జియ్యమ్మవలస వరకు ఉన్న బస్సు సర్వీస్‌ను వీరఘట్టం వరకు పొడిగించాలని వీరఘట్టం నుంచి ఎస్.లక్ష్మినాయుడు ఫోన్ ద్వారా కోరారు.
- బొబ్బిలి బస్ స్టేషన్లో టాయిలెట్ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని, సాలూరు, బొబ్బిలి కాంప్లెక్స్‌లలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరారు.
- చీపురుపల్లి పార్వతీపురం మధ్య బస్సు సౌకర్యం అలాగే విశాఖపట్నం-జైపూర్ వయా అలమండ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కొంతమంది ప్రయాణికులు కోరారు.

ఏపీలో ఉత్తమ రిసార్ట్స్‌గా సన్‌రే



ఎంపీ చిన్ని, మంత్రులు శ్రీనివాసరావు, భరత్ చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న రాజాబాబు

భోగాపురం: భోగాపురంలోని ఎ.రావివలస సమీపంలో ఉన్న సన్‌రే విలేజ్ రిసార్ట్స్ ఏపీ ఉత్తమ టీం బెస్ట్ రిసార్ట్‌గా గుర్తింపు పొందడం సంతోషించదగ్గ విషయమని మేనేజింగ్ డైరెక్టర్ ఇందుకూరి రాజాబాబు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాసరావు, భరత్ చేతులమీదుగా ఏపీ ఉత్తమ టీం రిసార్ట్ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ పురస్కారంతో వరుసగా ఏడోసారి గౌరవం దక్కినందుకు సంతోషిస్తున్నానని రాజాబాబు పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతి ఉద్యోగి కృషికి ఆయన అభినందనలు తెలియజేశారు.

బాలింత మృతి

విజయనగరం క్రైమ్: నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలింత అనమానాస్పద స్థితిలో మృతి చెందింది. బాలింత మృతిపై ఎస్‌హెచ్ఓ శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం నగరంలోని జిడ్డువారి వీధిలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరింది. అక్కడే ఓ బిడ్డను ప్రసవించింది. ఆ తర్వాత ఆమెకు ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. హాస్పిటల్ వైద్యులు విశ్వప్రయత్నం చేసినప్పటికీ తెలివిరాకపోవడంతో నగరంలోని ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న మరో హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ కూడా ఆమెకు తెలివి రాకపోగా మృతి చెందడంతో మృతురాలి బంధువుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్ ప్రత్యక్షంగా రెండు హాస్పిటల్ వర్గాలను పూర్తి స్థాయిలో విచారణ చేశారు. మొదటి హాస్పిటల్‌లో ఆపరేషన్ డాక్టర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగికి నియామకపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి సమాజానికి ఉత్తమ సేవలందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జెడ్పీ పరిధిలో ఉద్యోగోన్నతి పొందిన వారికి నియామక పత్రాలను తన చాంబర్‌లో శుక్రవారం అందజేశారు. బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బుడతనాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకుడిగా నియామకమైన ఎస్.షఫీని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, ఏఓ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.